హైవే 65పై టోల్ చార్జీలు తగ్గింపు

- నేటి అర్ధరాత్రి నుంచి అమలు

పంతంగి వద్ద ఎన్‌హెచ్‌ఏఐ టోల్ ప్లాజా

చౌటుప్పల్ రూరల్, మార్చి 31 : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై సోమవారం అర్ధరాత్రి నుంచి టోల్ చార్జీలు తగ్గనున్నాయి. కేంద్ర ప్రభుత్వం గత ఏడాది జులై ఒకటి నుంచి టోల్ రుసుమును ఎన్‌హెచ్‌ఏఐ ఏజెన్సీల ద్వారా వసూలు చేస్తున్నది. గతంలో ప్రైవేటు ఏజెన్సీలు ఉన్న సమయంలో ప్రతి సంవత్సరం టోల్ ఫీజులు పెంచుకునే నిబంధనలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ సంస్థ నిర్వహణలో ఉండటంతో 2025 ఏప్రిల్ 1నుంచి ఎన్‌హెచ్‌ఏఐ టోల్ రుసుములను తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. 181.5 కిలోమీటర్ల హైవేను రూ.1,740 కోట్లతో నిర్మించిన జీఎంఆర్ సంస్థ 2012 డిసెంబర్ నుంచి 2024 జూన్ 31వరకు టోల్ వసూళ్లను నిర్వహించింది. హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారి 65పై చౌటుప్పల్ మండలం పంతంగి వద్ద, కేతెపల్లి మండలం కొర్లపహాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలు ఉన్నాయి.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద ఒక వైపు ప్రయాణానికి కారు, జీపులకు 15 రూపాయలు, ఇరు వైపులకు రూ.30, చిన్నతరహా వాణిజ్య వాహనాలకు ఒక వైపు ప్రయాణానికి రూ.25, రెండు వైపులకు కలిపి రూ.40, ట్రక్కులకు ఒకవైపు రూ.50, ఇరు వైపులకు 75రూపాయలు, చిల్లకల్లు టోల్ ప్లాజా వద్ద అన్ని రకాల వాహనాలకు ఒక వైపు ప్రయాణానికి 5రూపాయలు, ఇరువైపులా ప్రయాణానికి 10 రూపాయలు తగ్గించారు.

24గంటల్లో తిరుగు ప్రయాణానికి వాహనాలకు 25శాతం మినహాయింపు ఇచ్చారు. ఈ రుసుములు సోమవారం అర్ధరాత్రి నుంచి అమలవుతున్నాయి.

వరంగల్ హైవేపై పెరుగనున్న టోల్ చార్జీలు

- వాహనాన్ని బట్టి రూ.10 దాకా పెంపు

వరంగల్ హైవేపై గూడూరు టోల్ ప్లాజా

బీబీనగర్, మార్చి 31 : వరంగల్ జాతీయ రహదారిపై టోల్ చార్జీలు పెంచాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇవి సోమవారం అర్ధరాత్రి నుంచి అమల్లోకి రానున్నాయి. ఒక్కో వాహనంపై 5శాతం వరకు అదనంగా వసూలు చేయనున్నారు. వాహనాన్ని బట్టి ఒక్కో దానిపై 10రూపాయల వరకు పెరుగనుంది. వరంగల్ జాతీయ రహదారిపై ఉన్న బీబీనగర్ మండలంలోని గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాన్ని బట్టి మినిమం రూ.10 వరకు పెరిగింది. జీపు, వ్యాన్‌కు ఒక వైపు ప్రయాణానికి రూ.115 ఉండగా, ఇప్పుడు రూ.120కి పెంచారు. రెండు వైపులా ప్రయాణానికి రూ.180 చేశారు. లైట్ కమర్షియల్ వెహికిల్‌కు రూ.175 ఉండగా.. రూ.185కి, రౌండ్ ట్రిప్‌నకు 280 రూపాయలకు పెరిగింది. బస్సు, ట్రక్‌కు రూ.355 నుంచి రూ.375కు, రెండు వైపులా ప్రయాణానికి రూ.565కు పెంచారు. ఏడు లేదా అంతకంటే ఎక్కువ యాక్సిల్ ఉన్న వాహనాలకు ట్రిప్‌నకు రూ.700 ఉండగా ఇప్పుడు 745 రూపాయలు చేశారు. రౌండ్ ట్రిప్‌నకు 1,115 రూపాయలకు ఎగబాకింది.

ఆపరేషన్ కగార్‌ను ఆపాలి : న్యూడెమోక్రసీ

ధర్నా పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు

ఆలేరు టౌన్, మార్చి 31 : ఆదివాసీలు, మావోయిస్టులను సజీవంగా పట్టుకొని క్రూరంగా కాల్చి చంపుతున్న ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఏప్రిల్ 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిర్వహించే ధర్నా పోస్టర్‌ను పట్టణంలోని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కార్యాలయం ఎదుట సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదివాసీలను, మావోయిస్టులను అడవుల నుంచి తరిమికొట్టడం అప్రజాస్వామికమని మండిపడ్డారు. కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపడం ఖాయమన్నారు. అటవీ సంపదను బడా బాబులకు దోచిపెట్టడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని విమర్శించారు. రాబోయే రోజుల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు రాచకొండ జనార్దన్, మామిడాల భిక్షపతి, ఇక్కిరి సహదేవ్, అడివయ్య, మామిడాల సోమయ్య, ఎలగందుల సిద్ధులు, బాలకిషన్, సిద్ధేశ్వర్, రాజు, చంద్రయ్య, సత్యనారాయణ, రాములు, వెంకటేశ్, మక్కయ్య పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం : సీపీఎం

డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల వద్ద సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి ఆంజనేయులు

మోటకొండూర్, మార్చి 31 : ప్రజా సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైదని, హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని సీపీఎం మండల కార్యదర్శి కొల్లూరి ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అధికారులు సందర్శించి, పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని, వసతులు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముత్యాల సంతోష్, బెల్లంకొండ లక్ష్మి, గంజి సంతోష, మాధవి, పద్మ, బాలనర్సమ్మ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

అడ్డగూడూరు, మార్చి 31 : మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద అసర్ల మౌనిక బీరప్ప సహకారంతో ఎస్వీఆర్ యూత్ సభ్యులు సోమవారం చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువ కానుండటంతో మండల కేంద్రానికి వివిధ పనుల కోసం వచ్చేవారు చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూలపల్లి రాజశేఖర్‌రెడ్డి, నాగులపల్లి సాయికృష్ణ, కన్నెబోయిన రమేశ్, పయ్యావుల సాయి, జోగు మధు, అసర్ల మధు, నాగులపల్లి మధు, సామ సందీప్, ఏనుగు నరేశ్ పాల్గొన్నారు.

విజ్ఞాన గనికి స్వీపరే సర్వాధికారి

- నామమాత్రంగా పోచంపల్లి శాఖా గ్రంథాలయం నిర్వహణ
- దినపత్రికలకే పరిమితం.. పట్టించుకోని పాలకులు

పాఠకులు లేక వెలవెలబోతున్న భూదాన్ పోచంపల్లిలోని శాఖా గ్రంథాలయం

భూదాన్ పోచంపల్లి, ఫిబ్రవరి 12 : పట్టణంలోని శాఖా గ్రంథాలయం 40 సంవత్సరాలుగా ఎంతో మందికి విజ్ఞానం పంచింది. పాఠకులతో నిత్యం కళకళలాడే ఆ గ్రంథాలయం పాలకులు, అధికారులు పట్టించుకోక పోవడంతో నేడు వెలవెలబోతున్నది. ఇన్‌చార్జి గ్రంథాలయ అధికారి నెలకు రెండు సార్లు చుట్టపు చూపుగా వచ్చి వెళ్తున్నారు. ఈ క్రమంలో స్వీపర్‌గా పనిచేస్తున్న మహిళ నిత్యం గ్రంథాలయం తాళం తీసి అన్నీ తానే చూసుకుంటుంది. విజ్ఞానం కోసం పుస్తకాలు లేకపోవడంతో పాఠకులు, యువత గ్రంథాలయానికి రావడం మానేశారు.

జిల్లాలో ముగ్గురే గ్రంథ పాలకులు

జిల్లాలోని 17 మండలాల్లో ముగ్గురు మాత్రమే గ్రంథాలయ అధికారులు ఉన్నారు. ఒక్కో అధికారి నాలుగైదు గ్రంథాలయాల ఇన్‌చార్జి బాధ్యతలు చూస్తున్నారు. ఏండ్ల తరబడిగా స్వీపర్లు, అటెండర్లు, పార్ట్ టైం తాత్కాలిక ఉద్యోగులుగా కొనసాగుతున్నారు. పూర్తి స్థాయిలో గ్రంథాలయ అధికారులు లేక ఇబ్బందులకు గురవుతున్నారు. దాంతో గ్రంథాలయాలు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి.

కంపతో అపరిశుభ్రంగా ఉన్న పోచంపల్లి గ్రంథాలయం పరిసరాలు

దినపత్రికలకే పరిమితం

భూదాన్ పోచంపల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు, నిరుద్యోగులకు విజ్ఞానం అందించే పుస్తకాలు అందుబాటులో లేవు. దిన పత్రికలు మినహా విజ్ఞానానికి సంబంధించిన పుస్తకాలు లేవని యువతీ యువకులు పేర్కొంటున్నారు. దీనికితోడు గ్రంథాలయ పరిసరాల్లో అపరిశుభ్ర వాతావరణం కారణంగా పాఠకుల సంఖ్య తగ్గిపోతుంది. పని వేళలు పాటించక పోవడంతో గ్రంథాలయం ఉంటుందా.. లేదా అన్న విషయం సందర్శకులకు అనుమానం కలిగిస్తుంది. గ్రంథాలయ అధికారి నెలకు రెండు సార్లు మాత్రమే వచ్చి వెళ్తున్నారని పాఠకులు పేర్కొంటున్నారు.

మందు బాబులకు అడ్డాగా..

గ్రంథాలయం మూసి ఉండడంతో సెలవు రోజుల్లో మందు బాబులకు అడ్డాగా మారింది. రాత్రివేళ మందు తాగి ఖాళీ సీసాలు పగులగొట్టడం, గుట్కాలు, సిగరెట్లు, బీడీలు కాల్చి పడవేయడంతో అపరిశుభ్రత నెలకొంది. గ్రంథాలయం వెనుక భాగంలో మూత్ర విసర్జన చేయడంతో కంపు కొడుతుంది. చెత్తాచెదారం పేరుకుపోవడంతో కుక్కలు, పందులు సంచరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గ్రంథాలయానికి పాఠకుల సంఖ్య తగ్గుతుంది.

గ్రంథాలయానికి నూతన కమిటీని ఏర్పాటు చేసి పూర్వ వైభవం తీసుకురావాలని.. పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, దినపత్రికలు అందుబాటులో ఉంచాలని, గ్రంథాలయం నిత్యం తెరిచి ఉంచాలని పాఠకులు, నిరుద్యోగ యువత, గ్రామస్తులు కోరుతున్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

భువనగిరిలోని ఈద్గాహ్‌లో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

భువనగిరి అర్బన్ : ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు

నమస్తే తెలంగాణ, నెట్‌వర్క్ : జిల్లా వ్యాప్తంగా నెల రోజులుగా ఉపవాస దీక్షలు ఆచరించిన ముస్లింలు సోమవారం ఈదుల్ ఫితర్ పర్వదిన వేడుకలను ఘనంగా జరుపుకొన్నారు. ఉదయం ఈద్గాహ్ మైదానాల్లో, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖబరస్థాన్‌కు వెళ్లి తమ పెద్దల సమాధుల వద్ద నివాళి అర్పించారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఈద్గాహ్‌ల వద్దకు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. రామన్నపేటలో ఈద్గాహ్ కమిటీ చైర్మన్ ఎంఏ వాహేద్, ప్రధాన కార్యదర్శి మజీద్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మల్లయ్య, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే, కలెక్టర్

భువనగిరి అర్బన్ : ముస్లింలకు పవిత్రమైన రంజాన్ పండుగను పట్టణంలో సోమవారం ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని హైదరాబాద్ చౌరస్తా సమీపంలోని ఈద్గాహ్ వద్ద ముస్లింలు ఉదయం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు చెప్పుకొన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతరావు, ఆయా పార్టీల నాయకులు ఈద్గాహ్ వద్దకు వెళ్లి ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. పట్టణంలోని ఈద్గాహ్‌ల వద్ద పోలీసులు, డాగ్ స్క్వాడ్ బృందాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. దర్గా ప్రాంగణంలోకి వెళ్లే దారిలో బారికేడ్లను ఏర్పాటు చేసి తనిఖీ చేశారు. డీసీపీ ఆక్షాంశ్ యాదవ్ పర్యవేక్షించారు. రంజాన్ వేడుకల్లో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎనబోయిన ఆంజనేయులు, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఏవీ కిరణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రంజాన్

- మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్



ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్

ఆలేరు టౌన్, మార్చి 31 : రంజాన్ పర్వదినం మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందని మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ అన్నారు. పట్టణంలోని రామ్‌శివాజీ నగర్‌లో బీఆర్ఎస్ యువ నాయకుడు, భిక్షమయ్య యువసేన పట్టణ అధ్యక్షుడు ఎండీ గోరేమియా నివాసానికి వెళ్లి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం దినేశ్ గార్డెన్‌లో గోరేమియా ఏర్పాటు చేసిన రంజాన్ విందులో పాల్గొని ముస్లింలతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా భిక్షమయ్యగౌడ్ మాట్లాడుతూ అల్లాహ్ ఆశీస్సులు అందరిపై ఉండాలని కోరారు. యువకులు బెట్టింగ్‌లకు బానిసలు కాకుండా సేవింగ్స్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, గుండాల మాజీ జడ్పీటీసీ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం గౌడ్, నాయకులు కొలుపుల హరినాథ్, ఆడెపు బాలస్వామి, పత్తి వెంకటేశ్, బేతి రాములు, పంతం కృష్ణ, సారాబు సంతోష్, రామకృష్ణ యాదవ్, బీజని మధు, దయ్యాల సంపత్, బాలకిషన్, శ్రవణ్, అజయ్, ఉప్పలయ్య, బీఆర్ఎస్ మైనార్టీ సెల్ జిల్లా నాయకుడు ఎండీ ఫయాజ్ పాల్గొన్నారు.

శామీర్‌పేట వాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బొమ్మలరామారం, మార్చి 31 : మండలంలోని ఖాజీపేట గ్రామం వద్ద గల శామీర్‌పేట వాగులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైంది. మృతుడి వయస్సు 30-35 సంవత్సరాలు ఉంటుందని, నలుపు రంగు షర్టుపై పెసరు రంగు టీషర్టు, నలుపు రంగు ప్యాంటు ధరించి ఉన్నాడని పోలీసులు తెలిపారు. శామీర్‌పేట వాగు గుంతలో చేపలు పట్టడానికి వెళ్లి ఈత రాక నీటిలో మునిగి చనిపోయినట్లు భావిస్తున్నట్లు చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు ఎస్ఐ శ్రీశైలం సెల్‌నెం 8712662474లో సంప్రదించాలని సూచించారు.

మహిళలపై వివక్ష చూపుతున్న ప్రభుత్వాలు : సీపీఐ

మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సత్యనారాయణ

మోటకొండూర్, మార్చి 31 : మహిళలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణ, జిల్లా మహిళా సమాఖ్య ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ అన్నారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలో భారత జాతీయ మహిళా సమాఖ్య మండల మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రక్షణ కరువైందని, లైంగికదాడులు జరుగుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని అన్నారు. అందాల పోటీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించడం సరికాదని పేర్కొన్నారు. అనంతరం సంఘం జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి గాదెగాని మాణిక్యం, మహిళా సంఘం నాయకులు మంచాల పద్మ, మంచాల రాధమ్మ, రేపాక ఉమ, భాగ్యమ్మ, మాధవి, సబిత, మహేశ్వరి, నాగమ్మ పాల్గొన్నారు.

'ఆత్మజ్ఞాన సదస్సును విజయవంతం చేయాలి'

సదస్సు కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆధ్యాత్మిక భక్త సమాజం ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 31 : పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో ఏప్రిల్ 1, 2, 3 తేదీల్లో ఆత్మజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు ఆధ్యాత్మిక భక్త సమాజం అధ్యక్షుడు భారత పురుషోత్తం, గౌరవాధ్యక్షుడు కటకం తుకారాం, ప్రధాన కార్యదర్శి నోముల అశోక్ తెలిపారు. ఆలయంలో సోమవారం ఆత్మజ్ఞాన సదస్సు కరపత్రాలు ఆవిష్కరించి మాట్లాడారు. సదస్సుకు నంద్యాల జిల్లా చాగలమర్రి పూజ వేదాంత ఆచార్యులు అభినవ శంకరానంద స్వామి హాజరవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక భక్త సమాజం ఉపాధ్యక్షుడు చక్రాల నర్సింహ, ప్రతినిధులు ఎల్లప్ప, యాదగిరి, కృష్ణ పంతులు, పాండు పంతులు, నరేందర్ పాల్గొన్నారు.

అనంతారం – తాజ్‌పూర్ గ్రామాల మధ్య ప్రమాదకరంగా సూచిక బోర్డులు లేకుండా ఉన్న మూలమలుపులు

ప్రమాదకరంగా మూల మలుపులు

- సూచిక బోర్డులు లేక ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

వీరవెల్లికి వెళ్లే దారిలో మూలమలుపు

భువనగిరి కలెక్టరేట్, మార్చి 31 : పల్లె రోడ్లల్లో ప్రయాణం ప్రమాదకరంగా మారింది. గ్రామీణ రోడ్లు అస్తవ్యస్తంగా ఉండటంతోపాటు ఎక్కువ మూలమలుపులు ఉండడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మూలమలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి, మండలంలోని వీరవెల్లి, కమ్మగూడెం, చందుపట్ల, కేసారం, రామచంద్రాపురం, అనంతారం, తాజ్‌పూర్, హన్మాపురం, బండసోమారం, గౌస్నగర్, ఎర్రంబల్లి తదితర గ్రామాల రోడ్లలో ఎక్కువగా మూలమలుపులు ఉన్నాయి. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనాల రద్దీ పెరుగడంతోపాటు స్పీడ్‌గా వస్తుండడంతో మూలమలుపుల వద్ద అదుపుతప్పి కింద పడుతున్నారు. మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి

గ్రామానికి వచ్చే రోడ్డుకు ఎక్కువ మొత్తంలో మూలమలుపులు ఉన్నాయి. మూలమలుపు వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో పలు మార్లు ప్రమాదాలు జరిగాయి. డాంబర్ రోడ్డులో ఉన్న మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాలి.

– తోటకూరి శ్రీశైలం, వీరవెల్లి

అధికారులు నిర్లక్ష్యం వీడాలి

అనంతారం నుంచి తాజ్‌పూర్‌కు వెళ్లే రోడ్డులో మూలమలుపుల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నిత్యం పనుల నిమిత్తం భువనగిరికి వచ్చి వెళ్లే క్రమంలో ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి మూలమలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలి.

– ఓరుగంటి రమేశ్‌గౌడ్, తాజ్‌పూర్

వైద్య విద్యార్థులకు సన్మానం

వైద్య విద్యార్థులను సన్మానిస్తున్న కాలనీ వాసులు

చౌటుప్పల్, మార్చి 31 : పట్టణంలోని విద్యానగర్ కాలనీ అభివృద్ధి కమిటీ కార్యాలయంలో వైద్య విద్య అభ్యసిస్తున్న కాలనీకి చెందిన విద్యార్థులను సోమవారం సన్మానించారు. సాధారణ కుటుంబాలకు చెందిన 9మంది విద్యార్థులు వైద్య విద్యను చదువుతున్నారు. వారందరికీ కాలనీ తరపున పూలమాలలు అందించి శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు మండలోజు సుభాశ్‌చంద్ర చారి, ప్రధాన కార్యదర్శి ముత్యాల హనుమంతురెడ్డి, నాయకులు వనం రాజు, ప్రతాపరెడ్డి, వెంకట్‌రెడ్డి, సంపూర్ణాచారి, కృష్ణా గౌడ్, శ్రీనివాసాచారి, వెంకటేశ్ గౌడ్ పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత

బాధిత కుటుంబానికి బియ్యం, సరుకులు అందజేస్తున్న యూత్ ప్రతినిధులు

భూదాన్ పోచంపల్లి, మార్చి 31 : ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన పట్టణానికి చెందిన జట్ల రాము కుటుంబానికి అభినవ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో అభినవ యూత్ అధ్యక్షుడు జోగు రవీందర్, కార్యదర్శి వేముల నరేశ్, కోశాధికారి వల్లాల బాలరాజు, సహాయ కార్యదర్శి కొయ్యడ లింగస్వామి, ప్రతినిధులు పద్మరుషి, నర్సింహ, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.